# చిల్లర లేదూ!

— గుండాబత్తుల శ్రీనివాస్



బస్సు వేగంగా పోతోంది. బస్సులో ప్రయాణిస్తున్న నేను రివ్వున వీస్తున్న చల్లని గాలులను ఆస్వాదిస్తూ న్యూస్ పేపరును చదువుతున్నాను. వెనుక మెత్తని స్పర్శ ముఖం త్రిప్పి చూశాను. వెనుక సీటులో వ్యక్తి "సార్! ఓసారి పేపరిస్తారూ, నిన్న మ్యాచ్‌లో ఎవరెన్ని రన్స్ చేశారు? మేనాఫ్ ది మ్యాచ్ ఎవరు?–"

అంటూ ప్రశ్నల వర్షం కురిపించసాగాడు. అతనివైపు సీరియస్‌గా ఓ లుక్ ఇచ్చి మళ్ళీ యధావిధిగా పేపరులో మునిగిపోయాను. అప్పటికి నా ఫ్రంట్ సీటులో వ్యక్తి రెండుసార్లు పైకిలేచి కూర్చున్నాడు. అతని దృష్టంతా నా పేపరుపైనే అని కొన్ని నిమిషాల తరువాత తెలుసుకోగలిగాను. "ఏవండీ! కొత్త సినిమాలు రిలీజ్ డేట్స్ ఏమైనా పడ్డాయా?" అంటూ చాలా కంగారుగా అడిగాడు. ఆ కంగారు ఎందుకో తెలీదుగాని ఆ ప్రశ్నకు బస్సులో ప్రయాణికుల దృష్టి అతనిపై పడింది. ఏం మాట్లాడకుండానే పేపరు పేజీలు తిరగేస్తూ చదవనారంభించాను. ఇంతలో నా ఒడిలో ఓ కాగితం వచ్చి వాలింది. అది లాటరీ టిక్కెట్ నాలుగు సీట్లు వెనుకవైపు నుండి ఓ వ్యక్తి గిరాటువేసిన బాపతది. అంత దూరం నుండి అతను కేకలేస్తూ "సార్! ఆ నెంబరుకు లాటరీ ఏమైనా తగిలిందేమో చూడండి" అంటూ నావైపు ఆత్రంగా చూశాడు. లాటరీ టిక్కెట్‌ను మడచి కాగితం రేకెట్‌గా తయారు చేసి అతనివైపు విసిరేశాను. వెనుక వైపు నుండి ఓ పెద్ద కామెంట్ "దేశం మీద పేపరు వాడి కొక్కడికోసం వాడికి మాత్రమే సొంతమన్నట్లు రెండు రూపాయిల న్యూస్ పేపరుతో తెగ కటింగ్‌లు ఇచ్చేస్తున్నాడ్రా"–అంటూ ఇంకా ఏవేవో మాటలు వాళ్ళకివ్వాలనే ఉంది పేపరు. కాని ఎందుకో, వాళ్ళు అడిగిన తీరు బొత్తిగా నాకు నచ్చలేదు. బస్సు ముఖ్యమైన స్టేజీలలో ఆగుతూంది. దిగేవాళ్ళు దిగుతున్నారు. ఎక్కే వారు ఎక్కుతున్నారు.

ఓ స్టేజిలో ఓ అరవై సంవత్సరాల వయస్సు పైబడిన ఓ అవ్వ ఎక్కింది. ఓ చేత్తో కర్ర మరో చేత్తో మట్టి చిప్ప పట్టుకుని "ధర్మం బాబూ! ధర్మం!" అంటూ అందరిని అడుగుతూ వస్తుంది. ఆ అవ్వ ముఖం పరిశీలనగా చూస్తుంటే, ఎప్పుడో, ఎక్కడో చూసిన గుర్తు. ఎందుకో ఆమె అంటే ఆప్యాయత, జాలి కలుగుతోంది. ఒకరి తరువాత మరొకరిని "ధర్మం బాబూ! ధర్మం" అంటూ చాలా దీనంగా అడుగుతోంది. అలా అడగడంలో ఎంతో వినయం వుంది. కొంమందైతే తమకు తోచింది వేస్తున్నారు. కొంతమందైతే "చిల్లర లేదు...చిల్లర లేదు...చిల్లర లేదు" అంటూ చేయి ఊపేస్తున్నారు. ఆ అవ్వ క్రమం తప్పి నన్ను దాటి వెళ్ళిపోయింది. నన్ను న్యూస్ పేపరడిగిన వారి నుండి కూడా, "చిల్లర లేదు" అనే మాట నాకు చాలా స్పష్టంగా వినిపించింది. నాకు ఆ మాట అదోరకంగా అనిపించింది. సహజంగా ఎవరైనా ముష్టి అడిగితే కనీసం జేబులు కూడా తడుముకోకుండా "చిల్లర లేదు" అని చాలా ఠీవిగా చెప్పేస్తాం. అవ్వ "బాబూ! ధర్మం" అని అడిగేటప్పుడు ఎంత మనసు చంపుకుని అడుగుతుందో ఆమె ముఖంలో భావనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆమె నన్ను సమీపించి అడిగింది. "బాబూ! ధర్మం" అంటూ జేబులు తడుముకుని షాక్ తిన్నట్లనిపించింది. నిజంగా నా దగ్గర చిల్లర లేదు. ఉన్నది ఒక్కటే యాభై రూపాయిల నోటు. చిల్లర లేదని ఆ అవ్వతో చెప్పాలనిపించడంలేదు. ఆ మాట చాలా రొటీన్‌గా అనిపించింది. అవ్వ నాకేసే ఎంతో దీనంగా చూస్తోంది. ఆమె కంట్లో రక్తపు చుక్క లేదు. ఎన్నో రోజుల నుండి తిండి నిద్ర లేని దానిలా వుంది. నా నోటి నుండి మాట రావడం లేదు.

కండక్టర్, స్టేజ్ రావడంతో బెల్ కొట్టాడు. బస్ వేగానికి బ్రేక్ పడింది. నే దిగే స్టేజీ అదే. ఏం చేయాలో తోచడం లేదు. ఏదో ఆందోళన, "ఇంకా దిగేవాళ్ళు ఎవరైనా ఉన్నారా?" అంటూ కండక్టర్ వెనక్కి తిరిగి కేకలేశాడు. నాచేతిలో వున్న న్యూస్ పేపరును అవ్వచేతిలో పెట్టి "ఈ పేపరు ఏ కిరాణా షాపు దగ్గరో అమ్ముకో అవ్వా, కనీసం ఓ అర్థరూపాయి అయినా ఇస్తా రంటూ నా బేగ్ తీసుకుని బస్ డోర్‌లోకి దిగుతూ దిగుతూ వెనక్కి తిరిగి చూసి ఆశ్చర్యపోయాను. ఇందాక "చిల్లరలేదు...చిల్లరలేదు" అన్న చాలామంది కూడా "అవ్వా! ఆ పేపరు నాకివ్వు అర్థరూపాయి ఇస్తాను. నాకివ్వు...నాకివ్వు..!" అంటూ పోటీ పడ్డారు.